ప్రజాశక్తి
బుధవారం 5 ఫిబ్రవరి 2025
5
అల్లూరి సీతారామరాజు



భూదాతలకు న్యాయం చేయండి



తహశీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న భూదాతలు

ప్రజాశక్తి- డుంబ్రిగుడ: మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన ఏకలవ్య పాఠశాలకు భూములు ఇచ్చిన భూదాతలకు న్యాయం చేయాలని కోరుతూ మంగళవారం భూదాతల కుటుంబీకులు ఏకలవ్య పాఠశాల నుంచి తహశీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ఇన్‌ఛార్జి తహశీల్దార్ ముజీబ్‌కు వినతిపత్రాన్ని అందజేశారు..కార్యక్రమంలో భూదాతల కుటుంబీకులు, కాంగ్రెస్ ,వైసిపి నాయకులు పాల్గొన్నారు.

లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణ

- లక్ష్యాల సాధనలో కుంటిసాకులు చెప్పొద్దు
- ఉపాధి హామీ పనుల పురోగతిపై అసంతృప్తి
- వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి -పాడేరు : లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరణకు నీడతోటలు పెంపకానికి ప్రతిపాదనలు తయారు చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్.దినేష్ కుమార్ ఆదేశించారు. రానున్న ఐదేళ్లలో లక్ష ఎకరాల్లో కాఫీ విస్తరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి ఆదేశించారన్నారు. ఏటా 20 వేల ఎకరాల్లో కాఫీని విస్తరించాలన్నారు. ఉపాధి హామీ పథకంలో నిర్దేంచిన పనులు పూర్తి చేయకుండా కథలు చెప్పొద్దని హెచ్చరించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులు పురోగతిపై అసంతృప్తి వ్యక్తం చేసారు. మంగళవారం జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పనులు, వ్యవసాయ శాఖ, ఉద్యాన వన శాఖ, మత్స్య శాఖ, పశు సంవర్ధక శాఖ, పౌర సరఫరాలు, సెరీకల్చర్ అధికారులతో వీడియో కాన్ఫరెన్సులో సమీక్షించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ ఎటపాక, పాడేరు, కొయ్యూరు, రాజ వొమ్మంగి, గంగవరం, కొయ్యూరు, అడ్డతీగల, విఆర్.పురం మండలల్లో ఫారం పాండ్స్ లక్ష్యాలు అధిగమించాలన్నారు. రబీ సీజన్ ఇ.క్రాప్ బుకింగ్ చేయాలని అన్నారు. వ్యవసాయ, ఉద్యానవన విభాగంలో 98 శాతం ఈ క్రాప్ బుకింగ్ చేసారన్నారు. క్రాప్ బుకింగ్ చేసిన మేరకు అథెంటికేషన్ పూర్తి చేయాలని సూచించారు. వరి, రాజ్‌మా పంటలకు ఇకెవైసీ వేయించాలని సూచించారు. పిఎం.కిసాన్ వెరిఫికేషన్ పక్కాగా చేయాలని ఆదేశించారు.

రెండు వారాల్లో ఇకెవైసి, , ఇ క్రాప్ బుకింగ్ పూర్తి చేయాలన్నారు. కూనవరం, చింతూరు మండలాల్లో ఉద్యానవన నర్సీలు పెంపకానికి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామన్నారు. ప్రజలకు ఉపయోగపడే ప్రాజెక్టులను అమలు చేయాలని ఆదేశించారు. . పాడేరు, రంపచోడవరం డివిజన్లలో వెదురు నర్సరీలు ఏర్పాటు చేయాలన్నారు. ముంచంగి పుట్టు మండలంలో కేజ్ కల్చర్ రెన్యువేషన్ ప్రక్రియ వేగంగా పూర్తి చేయాలన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో మరింత మల్బరీ సాగు విస్తరించాలని చెప్పారు. 200 ఎకరాలలో మల్బరీ సాగు లక్ష్యంగా నిర్దేశించగా 130 ఎకరాల్లో పూర్తి చేసారని, మిగిలినవి వేగంగా పూర్తి చేయాలన్నారు. షెడ్ల నిర్మాణాలకు కార్యచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. 25,700 టన్నులు ధాన్యం 100 టన్నులు రాగులు టన్నులు సేకరణ చేసారన్నారు. మిగిలిన లక్ష్యాలను అధిగమించాలన్నారు. వీడియెకాన్ఫరెన్సులో రంపచోడవరం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి కె సింహాచలం వర్చువల్ గాను, జిల్లా వ్యవసాయాధికారి ఎస్‌బి. ఎస్.నంద్, జిల్లా ఉద్యానవన అధికారి ఎ. రమేష్ కుమార్‌రావు, జిల్లా మత్స్యశాఖ అధికారి శ్రీనివాసరావు, జిల్లా సెరీకల్చర్ అధికారి అప్పారావు, ప్రత్యక్షంగా పాల్గొన్నారు.

జంతు సంరక్షణ చట్టాలపై అవగాహన



మాట్లాడుతున్న డాక్టర్ గణేశ్వరరావు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: జంతు సంరక్షణ చట్టాలపై ప్రతిఒక్కరికీ అవగాహన అవరసమని కాశీపట్నం పశువైద్యాధికారి డాక్టర్ గణేశ్వరరావు సాగిరి సూచించారు. మంగళవారం అనంతగిరి మండలం చిలకలగెడ్డ ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు జంతు సంక్షేమం, సంరక్షణ, జంతు చట్టాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ. జంతు చట్టాలు, జంతు కౄరత్వ నిరోధక చట్టం 1960 ప్రకారం జంతువులను హింసించడం, కొట్టడం, బాధ, నొప్పి కల్గించడం నేరమన్నారు. జంతువులను వినోదం కోసం ఎద్దుల పోటీలు, పొట్టేళ్ల కొట్లాట పోటీలు, కోళ్ల పందేలు వంటి జూదాలు ఆడడం, ప్రోత్సహించడం నేరమన్నారు. 1972 వన్యప్రాణుల సంరక్షణ చట్టం ప్రకారం వన్యప్రాణులను వేటాడడం, చంపడం, తోలు, మాంసం విక్రయించడం చట్టరీత్యా నేరమన్నారు.

1978 జంతు రవాణా చట్టం ప్రకారం జంతువులను ఎటువంటి సౌకర్యం, సదుపాయం లేని ట్రక్కులో కుక్కి రవాణా చేయడం, జంతువులను వాహనాలలో వేలాడదీసి రవాణా చేయడం నేరమన్నారు. విద్యార్థులు సామాజిక బాధ్యత కలిగి జంతువుల ప్రాముఖ్యత , విలువను దృష్టిలో పెట్టుకుని జంతు సంక్షేమం కోసం పాటుపడాలని సూచించారు. పాలు, మాంసం, గుడ్లు ఉత్పత్తి ద్వారా ఆర్థికాభివృద్ధి, పౌష్టిక ఆహార భద్రత, స్వయంఉపాధి దృష్ట్యా జంతువులను సంరక్షించే బాధ్యత కలిగి ఉండాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సైమన్, ఫిజికల్ డైరెక్టర్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు, జూనియర్ వెటర్నరీ అధికారి సుధావాణి, సచివాలయ పశుసంవర్ధక సహాయకులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు



వాహనాలను తనిఖీ చేస్తున్న సిఐ, తదితరులు

ప్రజాశక్తి హుకుంపేట: వాహనదారులంతా ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని స్థానిక సిఐ సన్యాసినాయుడు సూచించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల వద్ద వాహన తనిఖీలను నిర్వహించారు. ఈసందర్భంగా వాహనదారులంతా డ్రైవింగ్ లైసెన్స్‌తోపాటు ఇతర అన్ని వాహనపత్రాలను కలిగి ఉండాలని సూచించారు. బైకిస్టులు హెల్మెట్‌ను విధిగా ధరించాలన్నారు. మైనర్లకు వాహనాలిస్తే సంబంధించి వాహన యజమానిపై చర్యలు ఉంటాయని, దీనిపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. ప్రమాదాలకు తావులేకుండా ఉండాలంటే ప్రతిఒక్కరూ వాహన నిబంధలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ఈ సందర్భంగా వాహనపత్రాలు సక్రమంగా లేని 18మందికి జరిమానా విధించారు.

డోలి మోత కష్టాలకు చెక్ పడేనా.?

- రెండు కిలోమీటర్లు అడవి మార్గంలో నిండు గర్భిణిని మోసుకొచ్చిన కుటుంబసభ్యులు
- రోడ్డు సౌకర్యం కల్పనలో కొనసాగుతున్న నిర్లక్ష్యం
- అధికారులు, నేతల వైఖరిపై మన్యవాసుల ఆగ్రహం



గర్భిణి బుజ్జిని డోలిలో మోసుకొస్తున్న కుటుంబసభ్యులు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: ప్రభుత్వాలు, పాలకులెందరు మారినా మన్యంలో గిరిజనం రాకపోకల కష్టాలు, డోలిమోతల ఇక్కట్లకు అడ్డుకట్ట పడడం లేదు. అధ్వాన రహదారులు, అనేక గ్రామాలకు రోడ్లు లేని దుస్థితిలో నిత్యం ఏదో ఒక సమస్యతో బాధితులను మైళ్ల కొద్దీదూరం డోలిలో మోసుకెళ్లి, అక్కడ నుంచి ప్రయివేటు వాహనాలు లేకుంటే అంబులెన్స్‌ల్లో ఆసుపత్రులు తరలించడం పరిపాటిగా మారింది. మంగళవారం ప్రసవ వేదన పడుతున్న ఒక నిండు గర్భిణిని డోలిలో రెండుకిలోమీటర్ల దూరం మోసుకెళ్లి, అక్కడి నుంచి ఆసుపత్రికి తరలించిన ఘటన చోటుచేసుకుంది. వివరాలివి.

అరకులోయ మండలం మాడగడ పంచాయితీ, జాకరవలస పివిటిజి గ్రామానికి చెందిన మర్రి బుజ్జి నిండు గర్భిణికి నెలలు నిండి,మంగళవారం మధ్యాహ్నం 12 గంటల పురిటి నొప్పులు మొదలయ్యాయి. ప్రసవ వేదనతో బాధపడుతున్న ఆమెను అరకులోయ ఏరియా ఆసుపత్రికి తప్పక తీసుకెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. గ్రామానికి రోడ్డు సౌకర్యం లేకపోవడంతో అంబులెన్స్‌గానీ, ప్రయివేటు వాహనం గానీ రాలేని పరిస్థితుల్లో ఆమె భర్త మర్రి భీమరాజు, కుటుంబ సభ్యులు కర్రకు తాడుకట్టిన డోలి సాయంతో ఎత్తైన కొండ శిఖర గ్రామం నుంచి మెచ్చగుడ జంక్షన్ వరకు డోలీలో మోసుకొని అవస్థలు పడుతూ కొండలు, కోనలు, రాళ్లురప్పలు దాటుకుంటూ, అడవీ కొండమార్గంలో కాలిబాటన తీసుకొచ్చారు. అక్కడనుంచి అంబులెన్స్‌లో అరకు ఏరియా ఆసుపత్రి ఏరియా హాస్పిటల్‌కు తరలించారు.

రోడ్డు సౌకర్యం లేక... నిత్యం అవస్థలే

గిరిజన గ్రామాల్లో ప్రసవాలు, అత్యవసర ఆరోగ్య పరిస్థితుల్లో డోలిమోతలు సర్వసాధారణంగా మారాయని మన్యవాసులు వాపోతున్నారు. రహదారులు లేకపోవడమే ప్రధాన కారణంగా ప్రభుత్వం అధికారులు గుర్తించి ఏళ్లు గడుస్తున్నా సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టడం లేదని ఆవేదన చెదుతున్నారు. ఇటీవల పాడేరు ఏజెన్సీ పర్యటనకు వచ్చిన డిపూటీ సిఎం పవన్‌కల్యాణ్ డోలిమోతలనేవి లేకుండా చేస్తామని ఇచ్చిన హామీపైనే ఏజెన్సీ వాసులు ఎంతో ఆశగా ఎదురుచూస్తున్నారు.

రోడ్డు సౌకర్యం లేక ఇళ్ల నిర్మాణాలకూ ఇక్కట్లే

ప్రధానమంత్రి జన్‌మన్, ఆవాస్ యోజన, ఇతర పథకాల్లో మన్యవాసులకు ఇళ్లు మంజూరు చేస్తున్నప్పటికీ, నిర్మాణాలను చేసుకోలేని దుస్థితి ఉంది.ఇళ్లనిర్మాణాలకు అవసరమైన ఇసుక ,సిమెంట్, ఐరెన్ ఇతర ముడి చమురు తీసుకువెళ్లడానికి రోడ్డు సౌకర్యం లేక ఇల్లు కట్టుకోలేని పరిస్థితి ఉందని కొందరు గిరిజనులు అంటున్నారు. ఇవేకాక కొండశిఖరంతోపాటు మారుమూలన ఉన్న గిరిజన గ్రామాల్లో ప్రజలు పండించిన, సేకరించిన అటవీ ఉత్పత్తులను అమ్మకానికి తరలించాలన్నా, తమకు అవసరమైన సరుకులు కొనుక్కోవాలనుకున్నా కష్టాలు పడక తప్పడం లేదని ఆవేదన చెందుతున్నారు. రహదారి సౌకర్యం లేకపోవడమే ప్రధాన కారణంగా నేటికీ తామంతా అడవుల్లోనే సమస్యలతో మగ్గిపోతున్నామని ఏజెన్సీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పిఎంఎవై ఇళ్లకు ఆర్థిక సాయం పెంచాలి



మాట్లాడుతున్న వైస్ ఎంపిపి సత్యనారాయణ

ప్రజాశక్తి-ముంచింగిపుట్టు: ప్రధానమంత్రి ఆవాస్ యోజన పథకం ద్వారా మండలంలోనీ పివిటిజియేతర అన్ని కులాల ఆదివాసీ గిరిజనులకు ఇళ్లు మంజూరు చేయాలని సిపిఎమ్‌కు చెందిన మండల వైస్ ఎంపిపి-1 పాటుబోయి సత్యనారాయణ డిమాండ్ చేశారు. మంగళవారం పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం పిఎంఎవై ఇళ్లను మండలంలోని 23 పంచాయతీలలో భగత. వాల్మీకి, మాలి, గౌడు, కమ్మర, కుమ్మర, కొండదొర, కొటియాతో పాటు అన్ని సామాజిక వర్గాల అర్హులైన ఆదివాసీ గిరిజనులకు ఇళ్లుమంజూరు చేయాలని కోరారు. అలాగే గృహనిర్మాణ సాయాన్ని రూ.1.80లక్షలు కాకుండా రూ.ఐదు లక్షలకు పెంచి ఇవ్వాలని కోరారు. ప్రస్తుతం గృహనిర్మాణ ముడిసరుకు, ఇతరఅన్ని ధరలు విపరీతంగా పెరిగిపోయిన నేపథ్యంలో ప్రభుత్వమిచ్చిన రూ.1.80లక్షలు ఎటూ సరిపోవడం లేదన్నారు.గ్రామాల్లో గృహాల మంజూరు సర్వేలు వేగవంతం చేసి, లబ్ధిదారులకు తక్షణమే అడ్వాన్స్ బిల్లులు చెల్లించడం ద్వారా ఇళ్లనిర్మాణాలకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఆదివాసీగిరిజన సంఘం మండల సీనియర్ నాయకులు సొలగం గాసిరం దొర, మండల అధ్యక్షుడు ఎంఎం శ్రీను పాల్గొన్నారు.

తునికాకు సేకరణ పనులు వెంటనే చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్

ప్రజాశక్తి-రంపచోడవరం

ఫిబ్రవరి మొదటివారం నడుస్తున్నా నేటికీ తునికాకు టెండర్లు పూర్తికాలేదని, తునికాకు సేకరణ పనులు వెంటనే చేపట్టాలని సిపిఎం ఎఎస్‌ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్ మంగళవారం ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. తునికాకు టెండర్లు పూర్తి కాకపోవడంతో జిల్లాలోని విఆర్.పురం, చింతూరు, కూనవరం, ఎటపాక, రంపచోడవరం ప్రాంతాల్లో వేలాది మంది ప్రజల ఉపాధి దెబ్బతింటుందని పేర్కొన్నారు. ఇప్పటికే ప్రూనింగ్ పనులు చేపట్టాల్సి ఉందన్నారు. ఏజెన్సీలోని తునికాకు దొరికే ప్రాంతాల్లో కార్మికులు ఉపాధి కోల్పోకుండా రాష్ట్ర ప్రభుత్వం, అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ వెంటనే స్పందించి తునికాకు టెండర్ పనులు పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. టెండర్లు నిర్వహించకపోతే అటవీశాఖ అయినా నేరుగా ఆకు సేకరించవచ్చని చెప్పారు. ఈ రెండింటిలో ఏదో ఒకటి సత్వరమే నిర్ణయం తీసుకొని పది రోజుల్లో ప్రూనింగ్ పనులు ప్రారంభించాలని కిరణ్ ప్రభుత్వాన్ని కోరారు.

గుత్తేదారునిపై చర్యలు తీసుకోవాలి

ప్రజాశక్తి-విఆర్.పురం

మండలంలోని ఉమ్మడివరం పరిధి రెడ్డిగుంపులో కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను నాణ్యత లేకుండా నిర్మిస్తున్న గుత్తేదారునిపై చర్యలు తీసుకోవాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు రెడ్డి గుంపు గ్రామాన్ని మంగళవారం వారు సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో కొండరెడ్డిలకు ఒక్కో ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.75 లక్షలు మంజూరు చేసిందని తెలిపారు. గుత్తేదారుడు పది ఇళ్లు కాంట్రాక్ట్ వర్క్ చేశారని, ఈ పనుల్లో ఎటువంటి నాణ్యత లేదని, మట్టితో కలిసినా ఇసుకను, సరిపడా సిమెంట్ కలపకుండా నిర్మాణం చేయడంతో పగుళ్లు వస్తున్నాయని తెలిపారు. అందేలా లక్ష్మి ఇంటి స్లాబ్ సెంట్రింగ్ కర్రలు ఉండగానే పగులు ఇచ్చిందని పేర్కొన్నారు. ఇలా నాణ్యత లేకుండా నిర్మాణం చేస్తే ఆదివాసీలు దినదిన గండంగా నిద్ర లేకుండా గడపాల్సిన పరిస్థితి ఏర్పడుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. నాణ్యతలేని నిర్మాణాలు చేసిన గుత్తేదారులపై ప్రభుత్వం క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పాయం లక్ష్మణరావు, పొడియం రాజు, పాయం సుబ్బారావు, సోంది నాగేశ్వరరావు, సోడి వెంకటరమణమూర్తి, పాయం భాస్కర్, చిన్నపాటి సుబ్బారావు, బాధితులు అందేలా లక్ష్మి, ముర్ల ఈశ్వరమ్మ పాల్గొన్నారు.



ఇంటి నిర్మాణాలను పరిశీలిస్తున్న ఆదివాసీ నాయకులు

'కాంగ్రెస్ నేత ఆరోపణ అవాస్తవం'

ప్రజాశక్తి-సీలేరు

జీకే.వీధి మండలం సీలేరులో బస్ షెల్టర్, మరుగుదొడ్ల నిర్మాణాన్ని టిడిపి కుటమి నాయకులు అడ్డుకుంటున్నారని కాంగ్రెస్ నాయకులు కారె శ్రీనివాస్ చేసిన ఆరోపణ అవాస్తమని కూటమి నాయకులు చిటికెల రాము, వనముల రాము, గోవిందు బాలు పేర్కొన్నారు. స్థానిక విలేకర్లతో మంగళవారం వారు మాట్లాడుతూ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో గతంలో అప్పటి కాంగ్రెస్ ఎంపీ కమల కుమారి నిధులతో బస్సు షెల్టరు, పంచాయతీ నిధులతో దుకాణలు, మరుగుదొడ్లు నిర్మించాలని గుర్తు చేశారు. వాటిని వినియోగంలోకి తీసుకురాకుండా మరో బస్ షెల్టర్ కట్టడం హాస్యాస్పదంగా ఉందన్నారు. ఎటువంటి అనుమతులు లేకుండానే కొంతమంది నాయకులు సొంత నిర్ణయాలతో పంచాయితీ నిధులతో ఈ పనులు చేస్తున్నారని ఆరోపించారు. దీనిపై ట్రైబల్ వెల్ఫేర్ డిఈ తెలియజేయగా, ఒక బస్సు సెంటర్ ఉండగా మరో బస్సు షెల్టర్ మంజూరు చేయడానికి లేదని చెప్పినట్లు తెలిపారు. పంచాయతీ పరిధిలో పలు అభివృద్ధి పనులు ఉండగా వాటిని విస్మరించి, పంచాయతీ తీర్మానాలు లేకుండా పంచాయతీ నిధులతో బస్సు షెల్టర్ కట్టడం ఏమిటని ప్రశ్నించారు. పంచాయతీ నిధులు దుర్వినియోగంపై జిల్లా కలెక్టర్‌కు, డిపిఒకి ఫిర్యాదు చేస్తామన్నారు.



తాగునీటి బోరును ప్రారంభిస్తున్న సిపిఎం మండల కార్యదర్శి అర్జున్‌దొర

తాగునీటి బోరు ప్రారంభం

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

ఎటపాక మండలం లక్ష్మీపురం పంచాయతీ కేంద్రంలో ఆ గ్రామానికి చెందిన పూనెం వెంకట్రావు తన సొంత నిధులు రూ.80వేలు వెచ్చించి తాగునీటి బోరును ఏర్పాటు చేశారు. ఈ గ్రామ సచివాలయం పక్కన ఉన్న 40 కుటుంబాలకు తాగునీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారు. తమకు తాగునీటి సౌకర్యం కల్పించాలని పలుమార్లు అధికారులకు విన్నవించినా ఏ ఒక్కరూ స్పందించలేదు. దీంతో ఆ గ్రామంలో నివాసముంటున్న పూనెం వెంకట్రావు గ్రామస్తుల దాహార్తిని తీర్చడానికి తన సొంత నిధులు 80వేలు ఖర్చు చేసి చేతి పంపును ఏర్పాటు చేశారు. ఈ తాగునీటి బోరును సిపిఎం మండల కార్యదర్శి కాకా అర్జున్ దొర మంగళవారం ప్రారంభించారు. మంచినీటి బోరు ఏర్పాటు చేసిన పూనెం వెంకట్రావును పలువురు అభినందించారు. ఈ సందర్భంగా కాకా అర్జున్ మాట్లాడుతూ గ్రామ సచివాలయానికి పక్కనే ఉన్న కుటుంబాలకు తాగు నీరు అందక ఇబ్బంది పడుతుంటే అధికారులు చోద్యం చూస్తున్నారని, ఒక వ్యక్తి చేసిన పని వ్యవస్థ చేయలేకపోతుందని పేర్కొన్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తీవ్రంగా ఉందని, రానున్న వేసవిని దృష్టిలో పెట్టుకొని ఇప్పటినుండే కార్యాచరణ అమలు చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యులు సవలం రాము, నాయకులు నక్క సూరిబాబు, సోందే రమేష్, తెల్లం జంపయ్య, వాసం ధర్మరాజు, బుద్ధుల జానకి, సున్నం రమాదేవి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న గిరిజన సంక్షేమశాఖ డీడీ విజయశాంతి

పాఠశాలలను సందర్శించిన డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి-దేవీపట్నం

దేవీపట్నం మండలంలోని తాటివాడ, డిఎన్.పాలెం, పాముగండి, పెద్దూరు తదితర గ్రామాల్లోని జిపిఎస్, ఆశ్రమ పాఠశాలలను గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విజయశాంతి మంగళవారం సందర్శించారు. రికార్డులు, విద్యార్థుల హాజరు పట్టికలను తనిఖీ చేశారు. పాఠశాలల ఆవరణలు, స్టోర్ రూములు, వంటశాలలను పరిశీలించారు. పాఠశాలలలో మౌలిక వసతులు, సదుపాయాలు గురించి ప్రధానోపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. వసతి గృహాల్లో విద్యార్థులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా, తాగునీరు, ఆహారం విషయంలో సమస్యలు తలెత్తకుండా అన్ని రకాల జాగ్రత్తలు పాటించాలని సూచించారు. మెనూ ప్రకారం నాణ్యమైన ఆహారం, మెరుగైన విద్యా వైద్యం అందించాలని ఆదేశించారు.

శిథిలావస్థలో ఉన్న డ్రైయినేజీలను పునర్నిర్మించాలి

ప్రజాశక్తి-సీలేరు

జీకే వీధి మండలం సీలేరు నైన్త్ ఎక్స్‌టెన్షన్‌లో 15 సంవత్సరాలుగా శిథిలావస్థకు చేరుకున్న డ్రైనేజీలను తక్షణమే పునర్నిర్మించాలని సిఐటియు సీలేరు గౌరవాధ్యక్షులు ఎస్‌కే సుభాన్ డిమాండ్ చేశారు. స్థానిక విలేకరులతో మంగళవారం ఆయన మాట్లాడుతూ నైన్త్ ఎక్స్‌టెన్షన్ వెనుక భాగంలో ఉన్న కాలువ పూర్తిగా శిథిలావస్థకు చేరుకోవడంతో వర్షాకాలంలో మురుగునీరు ఇళ్లలోకి ప్రవహించి అనేక ఇబ్బందులు గురవుతున్నామని పేర్కొన్నారు. కాలువలో చెత్తాచెదారాలు, వ్యర్థ పదార్థాలు పేరుకుపోయి, మురుగునీరు నిల్వ ఉండి దుర్వాసన వస్తుందన్నారు. దోమలు విపరీంగా వృద్ధి చెందిన కంటి మీద కునుకు లేకుండా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. దోమ కాటు వల్ల మలేరియా, టైఫాయిడ్, డెంగీ వంటి వ్యాధుల బారిన ప్రజలు పడే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ఆరోగ్యానికి సంబంధించిన పనులు పంచాయతీ పాలకవర్గం చేపట్టకుండా వారికి నచ్చిన చోట పనులు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్రైనేజీలు శిథిలమై ప్రజలు ఇబ్బంది పడుతున్నా పంచాయతీ పాలకవర్గం నిర్లక్ష్యంగా వ్యవహరించడం దారుణమన్నారు. ఇప్పటికైనా సర్పంచి దుర్గ స్పందించి గ్రామపంచాయతీ నిధులతో డ్రైనేజీని తక్షణమే పునర్నిర్మించాలని కోరారు.

మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి-అల్లూరి జిల్లా

ఎటపాక మండలం కన్నాయిగూడెం పంచాయతీ పరిధి చింతలగూడెం గ్రామానికి చెందిన ఐతంరాజు శ్రీను ఇటీవల అనారోగ్యంతో మృతి చెందడంతో ఆ కుటుంబానికి జమాల్ ఖాన్ చారిటబుల్ ట్రస్టు తరుపున రూ.3వేలు ఆర్థిక సాయం అందజేశారు. కుటుంబ యజమాని అకాల మరణంతో ఆర్థిక ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రామ పెద్దలు ఆయుర్వేద వైద్యులు జమాల్ ఖాన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన జెకెసి ట్రస్టు తరుపున శ్రీను కుటుంబానికి రూ.3వేలు అందించారు. ఈ కార్యక్రమంలో హారిక, లంకపల్లి సత్యనారాయణ, బండారు భద్రయ్య, కొమ్ము వెంకటేశ్వర్లు, తోట రాము, టి సత్యనారాయణ, దేగల రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సహాయం అందిస్తున్న జమాల్ ఖాన్

కేన్సర్‌పై అవగాహన ర్యాలీలు



డుంబ్రిగుడలో అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -డుంబ్రిగుడ: ప్రపంచ కేన్సర్ నివారణా దినోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ పి రాంబాబు ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. పిహెచ్‌సి నుంచి మూడురోడ్ల జంక్షన్ మీదుగా బిఎస్‌ఎన్‌ఎల్ సెల్‌టవర్ వరకు ర్యాలీ సాగింది. అనంతరం వైద్యాధికారి రాంబాబు మాట్లాడుతూ కేన్సర్ వ్యాధిని ప్రాథమిక స్థాయిలో గుర్తిస్తే, సరైన చికిత్సతో దీన్ని నివారించవచ్చని, గుర్తించడంలో ఆలస్యమైనా,వైద్యసేవల్లో నిర్లక్ష్యమైనాఈ మహమ్మారి ప్రాణాంతకమౌతుందని వివరించారు. ర్యాలీలో డాక్టర్ అంబిక, ఎంపిహెచ్‌ఇఒ శౌరి, వైద్య సిబ్బంది, పాల్గొన్నారు.

పెదబయలు: ప్రపంచ కేన్సర్ నివారణ దినోత్సవం సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ నిఖిల్ ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంబేద్కర్ కూడలి జంక్షన్ వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. కార్యక్రమంలో ఆశావర్కర్లు సిబ్బంది పాల్గొన్నారు



సీలేరులో కేన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ హిమబిందు

విఆర్.పురం : ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ సందర్భంగా మండలంలోని రేఖపల్లి పిహెచ్‌సి ఆధ్వర్యాన కేన్సర్‌పై అవగాహన కల్పించడానికి మంగళవారం ర్యాలీ నిర్వహించారు. ఈ ర్యాలీ రేఖపల్లి పిహెచ్‌సి నుండి జంక్షన్ వరకు సాగింది. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ అనీల్ కుమార్, మాట్లాడుతూ ఆరోగ్యకరమైన జీవనశైలి, క్రమం తప్పని వైద్య పరీక్షలు, మానవ శరీరంలో వచ్చే మార్పులను గమనించడం వంటి విషయాలపైనా, నోటి క్యాన్సర్, రొమ్ము క్యాన్సర్, సెర్వికల్ క్యాన్సర్ వంటి వ్యాధుల పైనా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిహెచ్ యన్ భద్రకాళి, హెచ్‌వి పున్నమ్మ, సిహెచ్‌వోలు పవన్, సురేష్, పోచమ్మ, మంగ, అనూష, హెచ్‌ఏ శ్రీనివాస్, రామారావు, సత్యనారాయణ, ఎయన్‌యం చంద్రమ్మ పాల్గొన్నారు.



విఆర్.పురం మండలం రేఖపల్లిలో అవగాహన ర్యాలీ

సీలేరు : జీకే వీధి మండల కేంద్రంలో ప్రభుత్వాసుపత్రి వైద్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు మంగళవారం కేన్సర్‌పై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జికె.వీధి పిహెచ్‌సి వైద్యాధికారులు డాక్టర్ వినయ్ కుమార్, డాక్టర్ అచ్యుతరావు కేన్సర్ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఈవో సింహాచలం పీహెచ్‌ఎన్ ద్వారకా బై ఎంటిఎస్ శ్రావణి, ఎంఎల్‌హెచ్‌పీలు ఏఎన్‌ఎంలు హెల్త్ అసిస్టెంట్లు. ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీలేరులో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ ఖాదర్ మస్తాన్ వల్లి ఆధ్వర్యంలో వైద్య సిబ్బంది, ఆశా, అంగన్వాడీ కార్యకర్తలు మంగళవారం కేన్సర్‌పై అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఎన్ త్రినాధరావు, బాలమణి, జి అశోక్ కుమార్, వి వెంకట్రావు, అరుణ కుమారి, కెవిఎస్ కుమారి, బి దేవి పాల్గొన్నారు.

గిరిజనులు క్యాన్సర్ పట్ల అప్రమత్తంగా ఉండాలని ధారకొండ పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ డీకే హిమబిందు సూచించారు. ఆశా డేని పురస్కరించుకొని ప్రపంచ క్యాన్సర్ దినోత్సవ కార్యక్రమాన్ని పిహెచ్‌సిలో మంగళవారం నిర్వహించారు. క్యాన్సర్ లక్షణాలు కనిపించిన వెంటనే ఆరోగ్య తనిఖీలు చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పారామెడికల్ ఉద్యోగులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్య పాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో మంగళవారం వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడినట్లు సిఐ జి.బాలకృష్ణ తెలిపారు. సిఐ కథనం ప్రకారం... విజయనగరం జిల్లా తెర్లాం మండలం పణుకువలసకు చెందిన అలుగుబెల్లి గణేష్ (43) కుటుంబంతో మధురవాడ మిధిలాపురి ఉడాకాలనీలో నివాసముంటున్నాడు. పెయింటిగ్ పనులు చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. మృతుని భార్య శ్రావణి పిఎం.పాలెంలో టైలర్ పనులకు వెళ్లారు. ఇద్దరు కుమార్తెలు పాఠశాలకు వెళ్లారు. అ సమయంలో గణేష్ ఇంట్లోనే ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు సిఐ తెలిపారు.

కోడి పందేల శిబిరంపై దాడి

ప్రజాశక్తి -కొత్తకోట: రావికమతం మండలం కొత్తకోట గ్రామ శివార్లలో కోడి పందేల శిబిరంపై పోలీసులు దాడి చేశారు. ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకొని, వారి నుంచి రెండు కోడి పుంజులు, రూ.502 నగదు స్వాధీనం చేసుకున్నట్లు కొత్తకోట ఎస్ఐ ఎం. శ్రీనివాస్ తెలిపారు. గ్రామ శివార్లలో కోడి పందేలు ఆడుతున్నట్లు అందిన సమాచారంతో దాడిచేశామన్నారు. దాడుల్లో పోలీస్ సిబ్బంది జల్లుబాబు, శ్రీను పాల్గొన్నారు.

రవికి రక్షణ కల్పించాలి

ప్రజాశక్తి -జి.మాడుగుల: ఆదివాసీ సేన తెలంగాణ రాష్ట్ర సహాయ కార్యదర్శి, న్యాయవాది ఊకె రవిపై దౌర్జన్యాన్ని ప్రదర్శిస్తూ దాడికి ప్రయత్నించడంతో పాటు, ఆయన వాదిస్తున్న కేసులనూ, తన క్లైంట్స్ ద్వారా వెనక్కి తీసుకోకపోతే ఆత్మహత్య చేసుకుంటామని డ్రామాలాడుతూ, అశాంతియుత , ఘర్షణ వాతావరణం సృష్టిస్తున్న గిరిజనేతరులపై వెంటనే ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని దండకారణ్య విమోచన సమితి, కేంద్ర కమిటీ ప్రతినిధి మాణిక్యం డిమాండ్ చేశారు. జరిగిన సంఘటనపై అక్కడ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిన నేపథ్యంలో పోలీసులు నిష్పక్షపాతంగా తక్షణ చర్యలు చేపట్లాని కోరారు. ఏజన్సీ నిబంధనలకు విరుద్ధంగా మన్యంలోకి గిరిజనేతరులు అక్రమంగా చొరబడి ఆదివాసుల భూములను అన్యాయంగా లాక్కోడమే కాకుండా, తిరిగి ఆదివాసుల పైనే తిరగబడడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. ఏజెన్సీలో స్థిరనివాసమేర్పరచుకున్న గిరిజనేతరులను వెంటనే మైదాన ప్రాంతాలకు తరలించాలని కోరారు.

కేంద్ర కారాగారాన్ని సందర్శించిన ఎస్‌టి కమిషన్ సభ్యులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాఖ కేంద్రకారాగారాన్ని ఎస్‌టి కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ మంగళవారం సందర్శించారు. ముందుగా ఆయన ఆదివాసి నిందితులను స్వయంగా కలిసి మాట్లాడారు. కారాగారంలో కల్పిస్తున్న సౌకర్యాలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. జైలుకు రావడానికి దారితీసిన పరిస్థితులు, వారికి అందుతున్న న్యాయసహాయాన్ని పర్యవేక్షణాధికారిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆదివాసీలతో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలిసో తెలియకో చేసిన తప్పు కారణంగా జైలు జీవితాలు అనుభవిస్తున్నారని, ఇకనైనా జైలుకు రాకుండా సమాజంలో మెలగాలని సూచించారు. గంజాయి కేసులకు దూరంగా ఉండేలా, ఉపాధి కల్పించే దిశగా ఐటిడిఎ, జిసిసి సంస్థల సహకారం తీసుకొనే విధంగా చర్యలు చేపడతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పర్యవేక్షణాధికారి మహేష్, ఉప పర్యవేక్షణాధికారి ప్రవీణ్ కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్ ప్రయివేటీకరణను అడ్డుకుంటాం

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ కాకుండా అడ్డుకుంటామని పోర్టు డాక్ అండ్ ఎంప్లాయీస్ యూనియన్ (సిఐటియు) ప్రధాన కార్యదర్శి కె.సత్యనారాయణ స్పష్టంచేశారు. పోర్టు హాస్పిటల్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ పోర్టు హాస్పిటల్ వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు మంగళవారం నాటికి 127వ రోజుకు చేరుకుంది. ఈ దీక్షలనుద్దేశించి కె.సత్యనారాయణ మాట్లాడుతూ, ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమన్నారు. హాస్పిటల్ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకొని, తరిమి కొట్టాలని పిలుపునిచ్చారు. హాస్పిటల్ అభివృద్ధి కార్మికుల కృషితోనే సాధ్యమైందని, సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేట్ వారికి అప్పగించడం తగదన్నారు.

మార్చి 8న విద్యార్థులతో యోగాసనాలు

- జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్

ప్రజాశక్తి -పాడేరు

వచ్చేనెల 8వ తేదీన 12 వేల మంది విద్యార్థులతో యోగాసనాలు నిర్వహించడానికి అవసరమైన ప్రణాళికలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ఎఎస్. దినేష్ కుమార్ ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పాడేరు,జి.మాడుగుల, హుకుంపేట, అరకు వ్యాలీ మండలాల సహాయ గిరిజనసంక్షేమాధికారులు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులతో యోగాసనాల వలన కలిగే ప్రయోజనాలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యోగా వలన ప్రయోజనాలపై ప్రధానోపాధ్యాయులు, ఫిజికల్ డైరెక్టర్లు, ఎటిడబ్ల్యూఒలను అడిగి తెలుసుకున్నారు. యోగాసానాలు నేర్చుకున్న విద్యార్థుల ఆరోగ్యం, మానసిక స్థితిపై ఆరా తీసారు. యోగా నేర్చుకున్న విద్యార్థులు, నేర్చుకోని విద్యార్థులకు గల వ్యత్యాసాలను అడిగి తెలుసుకున్నారు. యోగాసనాలకు ముందుచ తరువాత విద్యార్థుల ఆరోగ్యంపై నివేదించాలన్నారు. ఆశ్రమ పాఠశాలల్లో వారానికి రెండు సార్లు యోగాసనాలు నిర్వహించాలని సూచించారు. పరీక్షలే జీవితం కాదని, ఒక సారి పరీక్ష తప్పిపోయినా మళ్లీ పరీక్షలు రాయవచ్చని విద్యార్థులకు అవగాహన కల్పించాలన్నారు. పరీక్షలు తప్పామన్న భయం, బాధతో విద్యార్థులు తొందరపాటు నిర్ణయాలు తీసుకోకుండా వారిలో అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులతో స్నేహపూర్వకంగా మెలగాలన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్. ఎజె. అభిషేక్ గౌడ, సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు ఎల్. రజని, పాడేరు యోగా గురు పతంజిలి శ్రీనివాస్, జి. మాడుగుల హుకుంపేట, అరకు వ్యాలీ మండలాల సహాయ గిరిజన సంక్షేమాధికారులు, ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులుపాల్గొన్నారు.

ఇదెక్కడి చోద్యం!

-మెయిన్‌రోడ్డుపైనే సూట్‌బాల్, బల్లాటలు

-బహిరంగ జూదంపై అధికారుల మీనమేషాలు

ప్రజాశక్తి -అరకులోయ రూరల్: అరకులోయ మండల కేంద్రంలోని బస్ కాంప్లెక్స్ వెళ్లే దారిలో ఆప్కో బట్టల షాప్ ఎదురుగా ఎటువంటి అనుమతి లేకుండా సూట్‌బాల్, బల్లాటలు వంటి జూదం బహిరంగంగానే నిర్వహిస్తున్నా సంబంధిత అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో స్థానికులు మండిపడుతున్నారు.. మండల కేంద్రంలోనే ఇలాంటి జూదక్రీడలు బహిరంగంగా నిర్వహిస్తున్నా నిర్లక్ష్యంగా వ్యవహరించడం దేనికి సంకేతమని ప్రశ్నిస్తున్నారు..ఇలాంటి జూదాలు పెట్టి గిరిజన యువత జీవితం నాశనం చేయవద్దని, నిర్వాహకులతో కొందరు వాగ్వాదానికి దిగారు. అయినా వారు నిర్లక్ష్యంగా వ్యవహరించడంపై ఆవేదన చెందుతున్నారు. తక్షణమే పోలీసులు, అధికారులు స్పందించి, పర్యాటక కేంద్రం అరుకులో మెయిన్ రోడ్‌లో ఏర్పాటు చేసిన ఇలాంటి జూదం ఆటలను తక్షణమే తొలగించాలని స్థానిక గిరిజనులు, ప్రజా సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.



మెయిన్‌రోడ్డులోనే సూట్‌బాల్, బల్లాట నిర్వహణ

అభ ఐడి మ్యాపింగ్ శతశాతం చేయాలి

ప్రజాశక్తి-సీతమ్మధార

అభ ఐడి మ్యాపింగ్ శతశాతం సాధించాలని వైద్యాధికారులకు, ఆరోగ్య సిబ్బందికి జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి పి.జగదీశ్వరరావు ఆదేశించారు. కొబ్బరితోట పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని మంగళవారం ఆయన సందర్శించారు. పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలోని ఆశా కార్యకర్తలు, ఎఎన్‌ఎమ్‌లు, మిగతా ఆరోగ్య సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఇ-ఆశా యాప్, అర్బన్ హెల్త్ న్యూట్రిషనల్ డే, హోమ్ బేస్డ్ కేర్ ఫర్ యంగ్ చైల్డ్, హోం బేస్డ్ న్యూ బోర్న్ కేర్, నేషనల్ డీ వార్మింగ్ డే, ఎన్‌సిడి 3.0 సర్వే తదితరాలపై వివరించారు.



నామినేషన్ వేస్తున్న రఘువర్మ

ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మూడు నామినేషన్లు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఉత్తరాంధ్ర పరిధిలోని విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం జిల్లాలకు సంబంధించిన ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానానికి మంగళవారం మూడు నామినేషన్లు దాఖలయ్యాయి. 3వ తేదీన నోటిఫికేషన్ వెలువడిన తొలి రోజు ఎవరూ నామినేషన్ దాఖలు చేయకపోగా, రెండో రోజైన మంగళవారం ముగ్గురు అభ్యర్థులు నామినేషన్లు వేశారు. రిటర్నింగ్ అధికారి, విశాఖ జిల్లా కలెక్టర్ ఎంఎన్.హరేంధిర ప్రసాద్‌ను వారంతా ఆయన కార్యాలయంలో కలిసి సంబంధిత పత్రాలను సమర్పించారు. అనంతరం ఆర్ఒ సమక్షంలో ప్రమాణం చేశారు. నామినేషన్లు వేసిన వారిలో ఎపిటిఎఫ్ మద్దతుదారు, సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ ఉన్నారు. ఆయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను దాఖలు చేశారు. అలాగే విశాఖ రైల్వే న్యూ కాలనీకి చెందిన కోసూరు రాధాకృష్ణ, అక్కయ్యపాలెం అబిద్ నగర్‌కు చెందిన సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఒక్కో సెట్ నామినేషన్ పత్రాలను ఆర్ఒకు సమర్పించారు. ఎఆర్ఒ బిహెచ్.భవాని శంకర్, నోడల్ అధికారి దయానిధి, ఎన్నికల సెల్ అధికారులు సంబంధిత సాంకేతిక ప్రక్రియలను పూర్తి చేసి అభ్యర్థులకు సహాయ సహకారాలు అందజేశారు

సిట్టింగ్ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ జివిఎంసి గాంధీ విగ్రహం నుంచి ఎపిటిఎఫ్ సంఘ సభ్యులతో కలిపి ర్యాలీగా కలెక్టరేట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసిపి ప్రభుత్వం రాష్ట్రంలో విద్యా వ్యవస్థను భ్రష్టు పట్టించిందని విమర్శించారు. రఘువర్మకు ఉత్తరాంధ్ర జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ వేపాడ చిరంజీవిరావు మద్దతు తెలిపారు. ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేసిన సత్తలూరి శ్రీరంగ పద్మావతి ఆనందపురం మండలం ఎంఇఒగా పనిచేసి ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. మరొక ఇండిపెండెంట్ అభ్యర్థి కోసూరు రాధాకృష్ణ జ్ఞానాపురం సెయింట్ జోసెఫ్ (ఎయిడెడ్) కాలేజీలో ప్రొఫెసర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేశారు. యుటిఎఫ్ బలపరిచిన పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల విజయ గౌరి గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. ఇందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. అదే విధంగా రెండు పర్యాయాలు ఎమ్మెల్సీగా పనిచేసిన గాదె శ్రీనివాసులునాయుడు పిఆర్‌టియు మద్దతుతో శుక్రవారం నామినేషన్ దాఖలు చేస్తారని ఆయన మద్దతుదారులు తెలిపారు.

వీల్‌చైర్స్ అందజేత

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (రోటరీ డిస్ట్రిక్ట్ 3020) నాలుగో వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని విభిన్న ప్రతిభావంతులకు 200 వీల్ ఛైర్లను, బియ్యం బస్తాలను మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రోటరీ డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రోటరీ క్లబ్ ఆఫ్ గ్రేటర్ విశాఖ (రోటరీ డిస్ట్రిక్ట్ 3020) గత నాలుగేళ్లుగా గంభీరంలోని ఏజ్ కేర్ ఫౌండేషన్‌కు సహకారం అందిస్తోందన్నారు. గోల్ఫ్ క్రీడ ద్వారా సుమారు రూ.10 లక్షల నిధులను సేకరించి పలు సంస్థలకు నిత్యావసర సరుకులు అందిస్తోందని తెలిపారు. రాజమండ్రిలోని గౌతం కంటి ఆసుపత్రికి ఇప్పటి వరకు రూ.కోటి విలువ చేసే సామగ్రి అందించారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా తమ సంస్థ పోలియో, కేన్సర్ నిర్మూలనకు పలు కార్యక్రమాలు చేపడుతోందని తెలిపారు. ప్రపంచ కేన్సర్ దినోత్సవం సందర్భంగా 9 - 14 ఏళ్ల బాలికలు 10 వేల మందికి సుమారు రు.2600 విలువ చేసే వ్యాక్సిన్లను ఉచితంగా అందించామన్నారు. కాకినాడ జిజిహెచ్‌లో హ్యూమన్ మిల్క్ బ్యాంక్ ఏర్పాటు చేశామని తెలిపారు. ఆంధ్ర మెడికల్ కళాశాలలో త్వరలో ఏర్పాటుకు సన్నాహాలు చేస్తున్నామని అన్నారు. ఇటీవల 75 మంది అంధ విద్యార్థులకు రూ.35,000 విలువచేసే స్మార్ట్ గ్లాసెస్ అందించామన్నారు.

మోగింది.. కల్యాణ వీణ

జోరుగా వివాహాలకు ముహూర్తాలు - మూడు నెలలు మినహా అన్ని నెలల్లో శుభకార్యాలు

కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌కు డిమాండ్

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : వివాహాలకు శుభ ముహూర్తం సమీపించింది. ఈ ఏడాదిలో మూడు నెలలు మినహా మిగిలిన అన్ని నెలల్లో శుభ ముహూర్తాలు ఉన్నాయని పండితులు పేర్కొంటున్నారు. జులై, ఆగస్టు, సెప్టెంబర్ మినహా మిగిలిన తొమ్మిది నెలల్లో 104 పెళ్లి ముహూర్తాలు ఉండటం విశేషమని అంటున్నారు. గత మూడేళ్లలో ఇంత సంఖ్యలో ముహూర్తాలు లేవని గుర్తుచేస్తున్నారు. జనవరి 30 తర్వాత మంచి ముహూర్తాలు ప్రారంభమయ్యాయని తెలిపారు.

ఈ ఏడాది వివాహ ముహూర్తాలు అధికంగా ఉండటంతో నగరంలో ముందుగానే ఎక్కడికక్కడ కల్యాణ మండపాలు, ఫంక్షన్ హాల్స్‌ను వధూవరుల తల్లిదండ్రులు బుక్ చేసుకుంటున్నారు. సాధారణం నుంచి అతి పెద్ద ఫంక్షన్ హాల్స్‌కు ఒక్కసారిగా అందరూ ఎగబడటంతో డిమాండ్ అధికమైంది. వివాహాలకు నెల నుంచి రెండు నెలల ముందే ఈ బుకింగ్‌లు జరుగుతున్నాయి. చుట్టుపక్కలున్న ప్రధాన ఆలయాల్లో కూడా బుకింగ్‌ల పరంపర కనబడుతోంది.

ఎందరికో జీవనోపాధి

ఈ ఏడాది ముహూర్తాలు అధికంగా ఉండటంతో ఎన్నో రంగాలకు సంబంధించిన వారికి జీవనోపాధి కలుగనుంది. ఇప్పటికే పెళ్లి దుస్తులు, బంగారు ఆభరణాలు, కిరాణా సరుకుల వ్యాపారాలు జోరందుకున్నాయి. లైటింగ్, డెకరేషన్, షామియానా, టైలరింగ్, వాయిద్య కళాకారులు, వేద పండితులు, రజకులు, నాయీబ్రాహ్మణులు, వంట మేస్త్రులు, పువ్వుల వ్యాపారులు, పెయింటర్లు, ఫొటోగ్రాఫర్లు, ట్రావెల్స్ నిర్వాహకులు.. ఇలా పలు రంగాల వారికి ఈ పెళ్లిళ్లతో ఉపాధి లభించనుంది.



శుభ ముహూర్తాలు ఇవీ..

ఫిబ్రవరిలో 5, 6, 7, 8, 10, 11, 12, 13, 14, 15 తేదీలు, మార్చిలో 4, 6, 7, 8, 11, 12, 13, 14, 15, 21, 22, 25, 26 తేదీలు, ఏప్రిల్‌లో 2, 3, 4, 5, 7, 8, 10, 11, 12, 14, 15, 21, 22, 23, 29 తేదీలు, మేలో 1, 2, 3, 5, 10, 12, 14, 20, 27, 28, 29, 30 తేదీలు, జూన్‌లో 3, 7, 10, 11, 12 తేదీలు శుభ ముహూర్తాలు ఉండగా, జూలై, ఆగస్టు, సెప్టెంబర్ మాసాలలో వివాహాల ముహూర్తాలు లేవు. అక్టోబర్‌లో 14, 16, 17, 18, 20, 21, 22, 23, 25, 30, 31 తేదీలలో శుభ ముహూర్తాలు ఉండగా, నవంబర్‌లో 7, 13, 14, 18, 19, 20, 21, 22, 26, 27 తేదీలలో మంచి ముహూర్తాలు ఉన్నాయి. ఇక ఈ ఏడాది ఆఖరి మాసం డిసెంబర్‌లో 2, 4, 5, 6, 15, 16, 17, 18, 19, 20, 23, 24, 30 తేదీల్లో మంచి ముహూర్తాలుగా ఉన్నాయని వేద పండితులు తెలిపారు.

రౌడీషీటర్ రాజు సహా ముగ్గురు అరెస్టు

హత్యాయత్నం కేసుతో రిమాండ్‌కు తరలింపు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : తనను ఉద్యోగం నుంచి తీసేశారన్న కోపంతో చిన్నపిల్లలపై పగబట్టిన ఓ రౌడీషీటర్ సహా ముగ్గురిని వన్‌టౌన్ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. సిఐ జిడి.బాబు కథనం మేరకు.. వన్‌టౌన్‌లోని ఎవిఎన్ కాలేజీ డౌన్ ప్రాంతంలో ఉంటున్న రాజు అలియాస్ రేపల రాజు అనే రౌడీషీటర్ గతంలో కొన్నాళ్లు పెద్దాసుపత్రి కెజిహెచ్‌లో పని చేసేవాడు. పిల్లలపై అత్యాచారయత్నానికి పాల్పడడం, మద్యం సేవించి డ్యూటీకి రావడం వంటి ఆరోపణలతో వైద్యాధికారులు ఆయన్ని ఉద్యోగం నుంచి తొలగించారు. ఈ నేపథ్యంలో వైద్యులపై కోపం పెంచుకున్న రాజు ఈ నెల 1న మధ్యాహ్నం వేళ ఆసుపత్రిలోని చిన్నపిల్లల వార్డుకు ఆక్సిజన్ సరఫరా అయ్యే పైపులను కట్ చేసే ప్రయత్నం చేశాడు. దీనిని గమనించిన సెక్యూరిటీ గార్డులు అడ్డగించే ప్రయత్నం చేశారు. వారిని రాజు కత్తితో బెదిరించాడు. ఆయనతోపాటు మరో ఇద్దరు ఈ దుశ్చర్యకు ప్రయత్నించారు. అనంతరం అక్కడి నుంచి పరారయ్యారు. పిల్లలకు ప్రాణవాయువు అందకుండా చేసి వారిని చంపేయాలన్న దురుద్దేశంతో మరో ఇద్దరి సాయంతో రాజు ఈ పని చేశాడని అందిన సమాచారం మేరకు వన్‌టౌన్ సిఐ జిడి.బాబు తన సిబ్బందితో కలిసి కెజిహెచ్‌కు వెళ్లి పరిశీలించారు.

సిసి ఫుటేజీ ఆధారంగా వారందరినీ అదుపులోకి తీసుకున్నారు. వైద్యాధికారుల ఫిర్యాదు మేరకు రాజు సహా మరో ఇద్దరిపై హత్యాయత్నం కేసు నమోదు చేశామని, ఆ ముగ్గురినీ అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సిఐ తెలిపారు. రాజుపై గతంలోనూ పలు కేసులున్నాయన్నారు.

బడ్జెట్‌పై నేడు అఖిలపక్ష కార్మిక సంఘాల నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కేంద్ర బడ్జెట్‌ను వ్యతిరేకిస్తూ అఖిలపక్ష కార్మిక సంఘాల ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 10:30 గంటలకు జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు సిఐటియు విశాఖ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్, ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి జిఎస్‌జె.అచ్యుతరావు తెలిపారు. ఈ మేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. కార్యక్రమంలో అన్ని కార్మిక సంఘాల కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.



నినాదాలు చేస్తున్న నాయకులు

1/70 చట్టం జోలికొస్తే సహించేది లేదు

ప్రజాశక్తి - రాజవొమ్మంగి : ఆదివాసీ చట్టాలను నిర్వీర్యం చేసినా, 1/70 చట్టం జోలికొచ్చినా సహించేది లేదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంజా శ్రీను హెచ్చరించారు. సంఘం ముఖ్య నాయకుల సమావేశం మండలంలోని ఎబి కాలనీలో మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీను మాట్లాడుతూ ఆదివాసీల పోరాట ఫలితంగా శాసనం ద్వారా ఏర్పాటు చేయబడిన 1/70 చట్టంపై అవగాహన లేకుండా అవహేళన చేస్తూ మాట్లాడుతున్నారని తెలిపారు. ఏజెన్సీలో 1/70 చట్టాన్ని సవరిస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుందని మాట్లాడటాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఏజెన్సీలో ఆదివాసీల పేరుతో పెట్టుబడులు పెడితే చట్టాన్ని అడ్డం పెట్టుకొని కొన్నేళ్ల తర్వాత వారు గిరిజనేతరులను మోసం చేస్తారని ఆదివాసీ సమాజాన్ని కించపర్చే విధంగా మాట్లాడిన అసెంబ్లీ స్పీకర్‌పై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే పోలవరం పేరుతో ఈ ప్రాంత ఆదివాసీల బతుకులను నాశనం చేశారన్నారు. 5వ షెడ్యూల్డ్ ప్రాంతాల్లో హక్కులు ప్రమాదాల్లో పడ్డాయని, యావత్ ఆదివాసీ ప్రజానీకం ఇప్పటికైనా ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తీగల బాబురావు, మొడిద నూకరాజు, చోడి ప్రదీప్ కుమార్, పీట ప్రసాద్, అన్నిక శ్రీను, గోకురి సత్యబాబు, మేసం దేవి, సాయిన బేబీ, పురుషోత్తం, కలింకోట శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పాడి వంతెన నిర్మాణానికి కృషి చేయాలి

ప్రజాశక్తి-కొయ్యూరు : మండలంలోని కొండగోకిరి పంచాయతీ పరిధి కొత్త పాడి, పాతపాడి గ్రామాలకు వెళ్ళే మార్గం మధ్యలో ఉన్న గెడ్డపై వంతెన పూర్తిగా కూలిపోయిందని, దాని నిర్మాణానికి కృషి చేయాలని టిడిపి పాడేరు నియోజకవర్గం ఇన్‌ఛార్జి గిడ్డి ఈశ్వర్‌కి సామాజిక సేవకుడు మురళీకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు గిడ్డి ఈశ్వరిని కలిసి వినతిపత్రం అందజేశారు. రత్నంపేట, గోకిరి పంచాయితీలే కాక సుమారు 7 పంచాయితీలు 25 గ్రామాల రాకపోకలు ఈ మార్గంలో సాగిస్తున్నారని తెలిపారు. దీనికి గిడ్డి ఈశ్వరి సానుకూలంగా స్పందించి తొందరలోనే వంతెన నిర్మాణం కోసం బడ్జెట్ కేటాయింపు చేసే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గోకిరి యువ సైన్యం సభ్యులు పాల్గొన్నారు.

జాతీయ క్రీడలకు టెక్నికల్ ఆఫీసర్‌గా శర్మ



ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఈ నెల 7 నుంచి 14 వరకు డెహ్రాడూన్‌లో జరిగే జాతీయ క్రీడలకు టెక్నికల్ ఆఫీసర్‌గా నగరానికి చెందిన డివిఎస్‌వై.శర్మ ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఎల్‌ఐసి సీనియర్ డివిజనల్ మేనేజర్ శారద ప్రసాద్ దాస్, ఎల్‌ఐసి ఎంప్లాయీస్ యూనియన్ జనరల్ సెక్రటరీ జి.వరప్రసాద్, ప్రెసిడెంట్ ఎం.కామేశ్వరి, ఎల్‌ఐసి ఉద్యోగులు, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్షుడు జెకె.నాయక్, అసోసియేషన్ సభ్యులు ఆయన్ని అభినందించారు. ప్రస్తుతం డివిఎస్‌వై శర్మ ఎల్‌ఐసి స్పోర్ట్స్ ప్రమోషనల్ బోర్డు మెంబర్‌గా, విశాఖ జిల్లా టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ టేబుల్ టెన్నిస్ అసోసియేషన్ ఉపాధ్యక్షునిగా వ్యవహరిస్తున్నారు.